
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 27.0
కనిష్ఠం 21.0

ANDHRAJYOTHY



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.30 (122.9667)	నిల్	9,646
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	639.70 (3.15)	1,800.29	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	100.91 (0.84)	1,250	నిల్

చికెన్ ధరలు	లైవ్ : రూ.120	డ్రెస్ : రూ.180	స్కిన్‌లెస్ : రూ.210





భక్తిశ్రద్ధలతో
గురుపౌర్ణమి

- పోటెత్తిన భక్తులు, ఆలయాల్లో బారులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాలన్నీ సాయి నామస్మరణతో మార్మోగాయి. ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు ప్రముఖులు పూజల్లో పాల్గొని సాయి బాబాకు క్షీరాభిషేకం చేశారు. సాయిబాబా కృప అందరిపై ఉండాలని, అంతా చల్లగా ఉండాలని వేడుకున్నారు.



గోపలాయపల్లి గుట్టపై ఆయుత చండీయాగం

- సీఎంతో చర్చించి నిర్ణయం
- రూ.2కోట్లతో గుట్టపై అభివృద్ధి పనులు
- చెర్వుగట్టుపై కాటేజీల నిర్మాణానికి కృషి : మంత్రి వెంకట్‌రెడ్డి •6లో..



ఆంధ్రజ్యోతి విజిట్

సాగర్ ఎడమకాల్వ 51వ మైలురాయి వద్ద పూర్తికాని లైనింగ్ పనులు

పనులు కావు..
కాల్వలు పారవు

- పూర్తికాని సాగర్ కాల్వ ఆధునికీకరణ, మరమ్మతు పనులు
- డిజైన్ డిచార్జ్ కంటే తక్కువ నీటి విడుదలతో నెరవేరని లక్ష్యం
- మూసీకి వరదలు పోటెత్తితే కాల్వ కట్టలకు ప్రమాదం
- కాల్వల కట్టల పటిష్ఠానికి చర్యలు తీసుకోని అధికారులు •7లో..

సాగర్ ఆయకట్టులో తొలకరి జల్లులకు దుక్కులు దున్నిన రైతులు నారుమడులు పోసి నాట్లు వేసేందుకు భారీ వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. ఎగువ నుంచి కృష్ణమ్మ వరద ప్రవాహం పెరిగి పైనున్న ప్రాజెక్టులు నిండితే సాగర్‌కు నీరు వస్తుంది. ఈ సీజన్‌లో సాగర్ నిండితే సాగునీటిని విడుదలచేసే అవకాశం ఉంటుంది. అయితే సాగర్ నీటిని విడుదల చేస్తే చివరి భూములకు నీరందడం ప్రశ్నార్థకంగా మారింది. ప్రధాన కాల్వల మట్టి కట్టల లైనింగ్ పనులు పూర్తికాకపోవడంతో చివరి భూములకు పూర్తిస్థాయిలో నీరందే అవకాశాలు లేవు. ఇదిలా ఉండగా, మూసీ కాల్వల పరిస్థితి కూడా అంతే ఉంది. ఏళ్లుగా కాల్వకట్టల నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో భారీ వరదకు కట్టలు తెగేలా ప్రమాదకరంగా ఉన్నాయి. గత ప్రభుత్వం రూ.300కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించినా నిధులు విడుదలకాలేదు.

తరగతికి ఒక గదిని, ఉపాధ్యాయుడిని కేటాయించాలి
టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

సూర్యాపేటటౌన్, జూలై 21: రాష్ట్ర ప్రభుత్వం తరగతికి ఒక గదిని, ఉపాధ్యాయుడిని కేటాయించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేయాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, సాంకేతిక కారణాలు, ఆప్షన్లలో తప్పిదాలు జరిగిన ఉపాధ్యాయుల అప్పీళ్లను పరిష్కరించాలని కోరారు. పదోన్నతుల అనంతరం మిగిలిన ఖాళీలను కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని, 317 మ్యుచువల్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను, డీఏలను వెంటనే విడుదల చేయాలని, మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.భిక్షం, సుభాని, ప్రతాప్, పూలన్, రవికుమార్, యాకయ్య, కృష్ణమూర్తి, పోతురాజు నర్సయ్య, జాన్‌సుందర్, బడుగుల సైదులు, యాదగిరి, జానయ్య, కోటేశ్వరరావు, శ్యాంకుమార్, అశోక్, తూము శ్రీనివాస్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పరిరక్షణ పోరాటాలకు సిద్ధం కావాలి
ఎంప్లాయిస్ యూనియన్ నేత పాటి అప్పారావు

కోదాడ రూరల్, జూలై 21: ఆర్టీసీ పరిరక్షణకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఏఐటీయుసీ కార్యాలయంలో నిర్వహించిన ఆర్టీసీ కోదాడ డిపో ఎంప్లాయిస్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ఆర్టీసీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గత సీఎం కేసీఆర్ అనాలోచిత నిర్ణయాల వల్లే ఆర్టీసీ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి పాలకులు కూడా కార్మికుల సమస్యలు సానుకూల వాతావరణంలో వినే పరిస్థితులు లేవన్నారు. పరిపాలనా వ్యవస్థల్లో మార్పులు చేయాల్సిన ప్రభుత్వం ఆ ప్రయత్నం చేయడం లేదన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆర్టీసీ రక్షణకు కార్మికులంతా నడుంకట్టి పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్.రెడ్డి, డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వెంకటయ్య, రాజు, డిపో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జీవీ.స్వామి, ఎల్.రాజశేఖర్, సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె.లతీఫ్, నాయకులు శ్రీనివాస్, హరి, సుజాత, రంగమ్మ, భవాని, షేక్ మీరా, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

వాయువు అందక...
ఆయువు పోయింది



22 అడుగుల లోతు బావిలో కౌలు రైతు మృతి •8లో..



- పలు కీలక ప్రాజెక్టులకు మోక్షం కలుగుతుందనే ఆశాభావం
- ప్రతిపాదనలతో సిద్ధమైన ఎంపీలు కిరణ్‌కుమార్, రఘువీర్
- నేటి నుంచి లోక్‌సభ బడ్జెట్ సమావేశాలు
- బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్

కేంద్రం నిధులపై ఆశలు

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానుండగా, కేంద్ర బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధానిగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటుకాగా, ఎన్నికల సమయంలో బీజేపీ అగ్ర నేతలు ఉమ్మడి జిల్లాకు పలు హామీలు ఇచ్చారు. ఆ హామీలన్నీ నెరవేరుస్తారని, ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని, అందుకనుగుణంగా ఈనెల 23న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని ఆశిస్తున్నారు. ప్రధానంగా రైల్వే, జాతీయరహదారుల ప్రాజెక్టులు దక్కుతాయనే నమ్మకంతో ఉన్నారు. 18వ లోక్‌సభకు ఉమ్మడి జిల్లా నుంచి ఎన్నికైన కుందూరు రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఇద్దరూ మొదటిసారి లోక్‌సభలో అడుగుపెట్టనుండగా, కేంద్రంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ నుంచి వీరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో జిల్లా ప్రాజెక్టుల సాధనకు పార్లమెంట్‌లో గట్టిగా పోరాడాల్సినఅవసరం, బాధ్యత వారిపై ఉందని, ప్రజల ఆకాంక్షలను పార్లమెంట్‌లో ప్రతిబింబింపజేయాలని ఉమ్మడి జిల్లా వాసులు ఆశిస్తున్నారు.

– (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)



ఉమ్మడి జిల్లాలో కీలకమైన రైల్వేలైన్ బీబీనగర్-నడికుడి డబ్లింగ్, ఎలక్ట్రిఫికేషన్‌కు కేంద్రం పచ్చజెండా ఊపడంతో ఈ బడ్జెట్‌లో దండిగా నిధులు కేటాయిస్తారని భావిస్తున్నారు. అదే విధంగా ఇటీవలే కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానం చేసే హైదరాబాద్-విజయవాడ ర్యాపిడ్ రైల్వే ఏర్పాటుకు ఈ బడ్జెట్‌లో స్పష్టత రానుందని అంచనా. ఏళ్ల క్రితం సర్వే పూర్తయి అమలుకు నోచుకోని నల్లగొండ-మాచర్ల రైల్వేలైన్ చేపట్టేందుకు నిధులు కేటాయిస్తారని భావిస్తున్నారు. అదేవిధంగా ప్రతిపాదనల్లో ఉన్న కోదాడ-నేరేడుచర్ల-దేవరకొండ-జడ్చర్ల-రాయచూరు రైల్వేలైన్, డోర్నకల్-సూర్యాపేట-మిర్యాలగూడ-దేవరకొండ-అచ్చంపేట-గద్వాల రైల్వేలైన్లను మంజూరు చేయాలని ఉమ్మడి జిల్లా వాసులు కోరుతున్నారు. భువనగిరి-రాయిగిరి-ఆలేరు-జనగామ మధ్య నడిచే పుష్‌పుల్ రైలు ట్రిప్పులు పెంచాలని, విష్ణుపురం-మేళ్లచెరువు-జగ్గయ్యపేట-మోటమర్రి రైల్వేలైన్ మార్గంలో ప్యాసింజర్ రైళ్లను నడపాలని కోరుతున్నారు. భువనగిరి స్టేషన్ ఆధునికీకరణతో పాటు, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాప్ ఇవ్వాలని కోరుతున్నారు. ఘట్‌కేసర్ నుంచి రాయిగిరి వరకు ఎంఎంటీఎస్ విస్తరణకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తారని అంచనావేస్తున్నారు.



ఉపయుక్త ప్రాజెక్టులు సాధించేందుకు ప్రయత్నిస్తా



కేంద్రం నుంచి ఉమ్మడి జిల్లాకు ఉపయుక్త పథకాలు, ప్రాజెక్టులు సాధించేందుకు కృషి చేస్తా. హైదరాబాద్-సూర్యాపేట-కోదాడ-విజయవాడ మార్గంలో ర్యాపిడ్ రైల్వే వ్యవస్థను ఏర్పాటు, ఎన్నో ఏళ్లుగా సర్వేలకు పరిమితమైన నల్లగొండ-మాచర్ల, డోర్నకల్-సూర్యాపేట-దేవరకొండ-డిండి-గద్వాల రైల్వేలైన్ల ఏర్పాటుకు పోరాడతా. విష్ణుపురం-మోటమర్రి రైల్వేలైన్ మార్గంలో ప్యాసింజర్ రైలును నడిపించాలని రైల్వే శాఖపై ఒత్తిడి తెస్తా. ఐటీ, ఇండస్ట్రియల్ కారిడార్, డ్రైపోర్ట్, అగ్రో ఇండస్ట్రీస్‌కు కేంద్ర దన్ను లభించేందుకు కృషి చేస్తా. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో పూడికతీత చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తా.

– కుందూరు రఘువీర్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ

నిధులు, పథకాల సాధనకు కృషి



కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన అన్ని పథకాలు, నిధుల కోసం పార్లమెంట్ వేదికగా కృషి చేస్తా. భువనగిరి-ఆలేరు-జనగామ మధ్య పుష్‌పుల్ రైలు ప్రస్తుతం ఒకే ట్రిప్పు నడుస్తోంది. దీన్ని ప్రయాణికులకు అనుకూలంగా మరిన్ని ట్రిప్పులు నడిపేందుకు ప్రతిపాదిస్తా. భువనగిరి, రాయిగిరి, జనగామ స్టేషన్ల ఆధునీకరణతో పాటు, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌ని భువనగిరిలో ఆగేందుకు ప్రయత్నిస్తా. జాతీయరహదారులున్న చౌటుప్పల్, చిట్యాల, భువనగిరిలో సబ్‌వేలు, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదిస్తా. దోతిగూడెం తదితర ప్రాంతాల్లో నెలకొన్న ఫార్మాకంపెనీల కాలుష్యంతో ప్రజలకు కలుగుతున్న ఇబ్బందుల పరిష్కారానికి కృషి చేస్తా. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులపై సత్వర తీర్పు లు వచ్చేందుకు ప్రయత్నిస్తా. వీటితోపాటు ఉమ్మడి జిల్లాకు కేంద్రం నుంచి రావాల్సిన అన్ని ప్రాజెక్టులు సాధించేందుకు, పార్లమెంట్‌లో జీరో అవర్‌లో, ఇతర సందర్భాల్లో అవకాశమొచ్చిన ప్రతిసారీ ప్రస్తావించి వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తా.

– చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ

పలు ప్రాజెక్టులకు మద్దతు కోరుతున్న కాంగ్రెస్

- భువనగిరి-రాయిగిరిలో ఎనిమిది లేన్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌తో పాటు, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలకు రూ.33.50కోట్లతో ప్రతిపాదనలుండగా, మంజూరు చేయాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు. దీంతో పాటు పలు ప్రతిపాదనలు పార్టీ ఎంపీలు సిద్ధం చేశారు.
- రాష్ట్రంలో గత ప్రభుత్వం సకాలంలో నిధులు వినియోగించుకోలేకపోయినందున 100 మొబైల్ వెటర్నరీ యూనిట్లు వెనక్కివెళ్లాయి. వాటిని తిరిగి పునరుద్ధరించాలని కాంగ్రెస్ ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి కోరుతున్నారు. ఈ యూనిట్లు వెనక్కివస్తే జిల్లాలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక యూనిట్ లభిస్తుందని, దీంతో పశువైద్యం సులభమవుతుందని ఆయన అభిప్రాయపడుతున్నారు.
- కృషి విజ్ఞాన కేంద్రాల్లో పనిచేసేవారికి సాఫ్ట్‌వేర్ శిక్షణ ఇవ్వగా, వారికి ఇవ్వాల్సిన స్టైపండ్ రాలేదు. దాన్ని తక్షణం విడుదల చేయాల్సిన అవసరం ఉంది.
- ఇందిరమ్మ ఇళ్లను పీఎంఏవైతో కలిపి వినియోగించేందుకు కేంద్రం అంగీకరించాల్సి ఉంది. ఈ ప్రతిపాదనను కేంద్రం అంగీకరిస్తే పేదలకు ఇళ్లనిర్మాణం సులభతరమవుతుంది.
- చౌకధరల దుకాణాల్లో సీసీకెమెరాల ఏర్పాటుకు కేంద్రం నిధులివ్వాల్సి ఉంది.
- భువనగిరిలో ఇండస్ట్రియల్ పార్క్, దండుమల్కాపురంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి.
- ప్రతిష్ఠాత్మక రీజనల్ రింగ్ రోడ్డుకు కేంద్రం అంగీకరించినందున ఈ బడ్జెట్‌లో నిధులిస్తారని అంచనావేస్తున్నారు.
- 565వ నెంబర్ జాతీయరహదారిపై నకిరేకల్-నాగార్జునసాగర్ సెక్షన్‌లో నల్లగొండ పట్టణంలో బైపాస్ రోడ్డుకు నిధులకు ప్రతిపాదనలు ఉన్నాయి.
- హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిని ఆరులైన్లుగా విస్తరించేందుకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది.
- నూతనంగా ఏర్పాటైన సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో జవహర్ నవోదయ పాఠశాలలు మంజూరు చేయాల్సి ఉంది.
- కీలకమైన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు కేంద్రం నిధులివ్వాల్సి ఉంది.
- భువనగిరిలో సీసీఎంబీ (సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ) విస్తరణ కేంద్రాన్ని భువనగిరి పరిధిలోని బొమ్మాయపల్లిలో 120 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుకు ఏడేళ్ల క్రితమే ప్రతిపాదనలు ఉన్నాయి.
- భువనగిరి ఖిల్లాను కేంద్రం స్వదేశీ దర్శన్ పథకానికి ఎంపికచేసి, లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయగా,ఈ నిధులు ప్రస్తుత బడ్జెట్‌లో విడుదలయితే పనులు మొదలవుతాయని ఆశాభావంతో ఉన్నారు.

సాగర్ ఎడమ కాల్వపై పహారా



సాగర్ ఎడమ కాల్వపై రాత్రి సమయంలో పహారా కాస్తున్న అధికారులు

పెన్‌పహాడ్, జూలై 21: నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసిన నేపథ్యంలో మండల అధికారులు, పోలీసులు రాత్రి పగలు కాపలా కాస్తున్నారు. తాగునీటి అవసరాలకు ఖమ్మం జిల్లాలోని పాలేరు జలాశయానికి సాగర్ నుంచి నీటిని విడుదల చేశారు.మండల పరిధిలోని రైతులు దీన్ని సాగుకు వినియోగించకుండా ఉండేందుకు మండలంలోని దోసపాడు గ్రామం నుంచి నాగులపాటి అన్నారం మీదుగా వెళ్తున్న సాగర్ ఎడమ కాల్వ ఇరువైపుల ఉన్న కాల్వ కట్టలపై తూములను రైతులను తీయకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు, పోలీసులు పహారా కాస్తున్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి
రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాస్

హుజూర్‌నగర్, జూలై 21: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కేంద్రం 14 రకాల పంటలకు నామ మాత్రంగా ఎమ్మెస్పీ పెంచడం వల్ల ఉపయోగం లేదన్నారు. మద్దతు ధరల గ్యారంటీ బిల్లుకు పార్లమెంటు సమావేశాల్లో చట్టం చేయాలన్నారు. లఖింపూర్ రైతుల కుటుంబాలకు తక్షణమే ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రైతుల పోరాటం సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్ర వ్యవసాయశాఖ కమిషనర్ లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కొప్పోజు సూర్యనారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, నాయకులు ఎల్లావుల రమేష్, కందుల వెంకటేశ్వర్లు, వాసుదేవరావు, నర్సయ్య, శ్రీనివాస్, స్వామి, అంజయ్య, పద్మావతి, రమేష్, పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి
గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు భూక్యపాండునాయక్

మఠంపల్లి, జూలై 21: కాంగ్రెస్ గతంలో ఇచ్చిన హామీ మేరకు పోడు భూములు సాగు చేసుకుంటున్న ప్రతీ గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వాలని గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు భూక్యపాండునాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు దశాబ్దాలుగా నిరుపేద గిరిజనులు పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వారికి ఆ భూములపై హక్కు కల్పించాలన్నారు. స్థానిక సిమెంట్ పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలన్నారు. గిరిజనుల హక్కులను విస్మరిస్తున్న పాలక ప్రభుత్వాలపై ఈ నెల 30, 31న జరిగే జిల్లా సదస్సులో చర్చించి కార్యాచరణ రూపొందించి ఉద్యమిస్తామన్నారు. ఈ సదస్సును సంఘం నాయకులు, మేధావులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు బాలునాయక్, నాయకులు పి.రాము, వీరబ్రహ్మాచారి, కేశ్యానాయక్, లక్ష్మి, సుజాత, రాముడు, శంభయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 'శిక్ష సప్తాహ'



నల్లగొండ, జూలై 21: జాతీయ విద్యావిధానం ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'శిక్ష సప్తాహ' కార్యక్రమం నిర్వహించాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు ఏడు రోజుల పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. తొలి రోజు సోమవారం ఉపాధ్యాయులు స్థానిక అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సామగ్రితో టీఎల్‌ఎం రూపొందించి ప్రదర్శించాలి. 23న నిపుణ్ భారత్, ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమాలు నిర్వహించాలి. 24న క్రీడా, వయోజన వ్యవహారాల శాఖ, ఎన్‌ఎస్‌ఎస్‌తో సమన్వయం చేసుకొని ఆటల పోటీలు, 25న విద్యార్థుల్లో ఐకమత్యం, భిన్నత్వం, అవగాహన కల్పించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి. 26న ప్రస్తుత ఆధునిక కాలంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలను, డిజిటలీకరణపై అవగాహన, 27న పర్యావరణం, ఆరోగ్యం, జీవన విధానం, విటమిన్‌లతో కూడిన సమతుల ఆహారం గురించి అవగాహన కల్పించాలి. అదేవిధంగా పాఠశాలలో మొక్కలు నాటి నూతనంగా ఏకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలి. చివరి రోజు 30వ తేదీన పాఠశాలల అభివృద్ధిలో సమాజం భాగస్వామ్యం పెంపొందించేలా, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచే వాతావరణాన్ని ఉపాధ్యాయులు కల్పించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమాలను ఎంఈవో, ఎంఎన్‌వో, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించనున్నారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాలను ఉపాధ్యాయులు తప్పనిసరిగా డాక్యుమెంటేషన్ చేసి భద్రపరచాలని నల్లగొండ డీఈవో భిక్షపతి సూచించారు.

లక్ష్మీనృసింహులకు శాస్త్రోక్తంగా నిత్యపూజలు


సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూలై 21: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. జంట నగరాల్లో బోనాలు, మూడు రోజులుగా కురుస్తున్న ముసురు కారణంగా వారాంతపు సెలవు రోజు అయినా రద్దీ సాధారణంగానే ఉంది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 25,23,042 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కొండపైన ప్రధానాలయంలో లక్ష్మీనృసింహులకు శాస్త్రోక్తంగా నిత్యపూజలు నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామి, అమ్మవార్లకు నిత్య పూజలు ఘనంగా చేపట్టారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో కొనసాగాయి. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.

గోపలాయపల్లిపై ఆయుత చండీయాగం

● చెర్వుగట్టుపై కాటేజీల నిర్మాణానికి కృషి ● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


గోపలాయపల్లి దేవస్థానంలో మంత్రి వెంకట్‌రెడ్డికి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న అర్చకులు

నార్కట్‌పల్లి, జూలై 21: సర్వ మానవాళి హితాన్ని కాంక్షిస్తూ వచ్చే ఏడాది గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి క్షేత్రంలో ప్రభుత్వంత రఫున ఆయుత చండీయాగం నిర్వహించేందుకు కృషి చేస్తానని, దీనిపై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి దేవస్థానంలో జరుగుతున్న సుదర్శన సహిత రుద్రయాగం పూర్ణాహుతి కార్యక్రమానికి ఆదివారం మంత్రి హాజరయ్యారు. తొలుత ఆలయానికి వచ్చిన మంత్రికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మూలమూర్తిని ఇతర ఉపాలయాలను మంత్రి దర్శించుకుని, యజ్ఞగుండం వద్ద పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలు, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆ వేణుగోపాలస్వామిని వేడుకున్నానన్నారు. ప్రతీ ఒక్కరు భక్తిభావం అలవర్చుకొని పరమత సహనం పాటించాలన్నారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని నమ్మిన ప్రభుత్వం తమదన్నారు. గోపలాయపల్లి గుట్టపై నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపం పూర్తికి రూ.2కోట్లతో పాటు ఘాట్‌రోడ్డు మరమ్మతులకు తన శాఖ నుంచి నిదులు కేటాయిస్తానని ప్రకటించారు. జిల్లాలో అతిపెద్ద శైవక్షేత్రమైన చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో కాటేజీల నిర్మాణానికి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, వేద పాఠశాల ఆచార్యుడు చేబియ్యం రాఘవశర్మ, నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి, కోమటిరెడ్డి చంద్రపవన్‌రెడ్డి, చినవెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు దూదిమెట్ల శ్రీనివాస్, పాశం శ్రీనివాస్‌రెడ్డి, వడ్డే భూపాల్‌రెడ్డి, గోసుల భద్రాచలం, దార యాద య్య, పుల్లెంల అచ్చాలు, బింగి కొండయ్య, ప్రజ్ఞాపురం సత్తి, పల్లె నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎండోమెంట్ ఏసీ మహేంద్రకుమార్, ఆ లయ మేనేజర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి

● ఇద్దరికి గాయాలు ● ఒకరి పరిస్థితి విషమం

పెద్దఅడిశర్లపల్లి, నిడమనూరు, జూలై 21: నల్లగొండ జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఒక యువకుడు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదాలు పెద్దఅడిశర్లపల్లి, నిడమనూరు మండలాల్లో ఆదివారం చోటుచేసుకున్నాయి.

● పెద్దఅడిశర్లపల్లి మండలంలోని జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారిలోని కోనమేకలవారిగూడెం స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు, స్థానికుల వివరాల ప్రకారం... అనుముల మండలం అల్వాలకు చెందిన లింగపల్లి కొండలు (19) మండలంలోని పులిచర్ల గ్రామంలో నిర్వహించే పీర్ల పండుగకు వచ్చాడు. వరుసకు బావమరిది అయిన వాకిటి అజయ్‌తో కలిసి ఆదివారం కొండమల్లేపల్లికి వచ్చారు. తిరిగి పులిచర్లకు వెళ్తుండగా కొనమేకలవారిగూడెం వద్ద ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొండలు రోడ్డుమీద పడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నర్సింహులు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రగాయాలైన అజయ్‌ను 108 వాహనంలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొండలు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.


● నిడమనూరు మండలం పార్వతీపురం క్రాస్‌రోడ్డు వద్ద ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ గోపాల్‌రావు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడలోని శాంతినగర్‌కు చెందిన నాగార్జునపు పాపాచారి, నాగార్జునపు నర్సింహాచారి ఇరువురు నాగార్జునసాగర్‌కు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. నిడమనూరు సమీపంలోని నారెళ్లగూడెం మేజర్ కాల్వ పక్కన పార్వతీపురం క్రాస్‌రోడ్డు వద్ద హాలియా నుంచి నిడమనూరు మీదుగా పార్వతీపురం వెళ్తున్న ఆటోను ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు కిందపడి గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గాయపడిన ఇద్దరిని వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో పాపాచారి తలకు బలమైన గాయమవడంతో అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. బాధితులు, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపారు.

సిటీలో ఇల్లు కొనుగోలు చేస్తున్నామని నమ్మించి..

రూ.రెండు కోట్లతో ఉడాయించిన వ్యాపారి

వలిగొండ, జూలై 21: హైదరాబాద్‌లో ఇల్లు కొనడానికి డబ్బులు అవసరం అని పలువురిని నమ్మించి మాయమాటలు చెప్పి రూ.రెండు కోట్లకు పైగా అప్పులు చేసిన ఓ వ్యాపారి కుటుంబం ఉడాయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గొల్నేపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, ప్రశాంత్, అనిల్, అన్నదమ్ములు కిరాణా వ్యాపారం నడుపుతూ 10సంవత్సరాల నుంచి చిట్టీల ఏజెంట్లుగా కొనసాగుతున్నారు. చిన్న సోదరుడైన అనిల్ ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. అన్నదమ్ములు గ్రామస్థులను మచ్చిక చేసుకుని మర్యాదగా ఉంటూ చాలామంది నుంచి పెద్ద మొత్తంలో నగదును అప్పుగా తీసుకున్నారు. తొలి రోజుల్లో వారు అడిగినప్పుడు తిరిగి అసలు వడ్డీ కలిపి ఇచ్చేవారు. మరికొందరికి ప్రతీ నెలా వడ్డీ చెల్లించేవారు. ఇలా చేయడంతో రుణదాతలకు నమ్మకం కలిగింది. నగదును అప్పుగా ఇవ్వడమే కాకుండా అతని వద్ద చిట్టీలు కూడా వేయడం ప్రారంభించారు. ఇదే అదునుగా భావించిన వెంకటేశ్వర్లు, ప్రశాంత్ సిటీలో ఇల్లు కొనుగోలు చేస్తున్నామని, డబ్బులు కావాలని పలువురి నుంచి రూ2కోట్లకు పైగా అప్పులు చేశారు. జూలై 15న రాత్రి ఇంటికి తాళం వేసి ఉడాయించారు. సదరు ఏజెంట్లు ఎంతకూ ఇంటికి రాకపోవడంతో అప్పులిచ్చిన వారికి అసలు విషయం అర్థం అయ్యింది. లబోదిబో మంటూ గుండెలు బాదుకుంటున్నారు. పైసా పైసా కూడబెట్టుకుని తమ కుటుంబాలకు ఆర్థికంగా ఆసరాగా ఉంటాయని సంపాదించిన నగదును తీసుకున్న అన్నదమ్ములు కనబడకపోయేసరికి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు చెక్కర్లు కొడుతున్నాయి. కొందరు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మిగిలినవారు కూడా పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా, సదరు వ్యాపారిపై విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

మానసిక ఒత్తిడితో ఆత్మహత్య


నవీన్‌కుమార్ (ఫైల్ ఫొటో)

బొమ్మలరామారం, జూలై 21: ఆరోగ్యం బాగుపడదనే మానసిక ఒత్తిడితో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసంఘటన ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం చీకటి మామిడి గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చీకమటి మామిడి గ్రామానికి చెందిన కడారి నవీన్‌కుమార్(32) క్షౌర వృత్తి పనిచేసేవాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని ఆరోగ్యం బాగుపడదనే మానసిక ఒత్తిడికి లోనవుతున్నాడు. నవీన్‌కుమార్ భార్య ఇటీవలే పుట్టింటికి వెళ్లి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. కాగా శనివారం రాత్రి నవీన్‌కుమార్ తన బెడ్ రూమ్‌లో ఇనుపరాడ్‌కు ఉరేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఎంతకూ బెడ్‌రూమ్ తలుపులు తీయకపోడంతో అనుమానంతో అతడి తండ్రి పక్కీర్ ఇరుగుపొరుగును పిలిచి కిటికీలు పగులగొట్టించాడు. అప్పటికే నవీన్‌కుమార్ విగతజీవిగా మారాడు. నవీన్ కుమార్ భార్య కడారి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

కట్టలు తెగేదాకా చర్యలు తీసుకోరా?

- మూసీకి వరదలు పోటెత్తితే కాల్వ కట్టలకు ప్రమాదం
- ప్రతి ఏటా నష్టపోతున్న రైతులు
- కాల్వల కట్టల పటిష్టానికి చర్యలు తీసుకోని అధికారులు



బ్రాహ్మణపల్లి శివారులో కాల్వకట్ట బలంగా లేక తరుచు గండి పడే ప్రదేశం

బీబీనగర్ : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మూసీకి, ఆయకట్టులోని పంట కాల్వలకు వరద తాకిడి పెరిగి కాల్వకు గండ్లు పడే ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు అప్రమత్తమై ముందస్తుగా కాల్వ కట్టలను ప్రతిష్ఠం చేయాల్సి ఉండగా పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఆయకట్టులోని బునాదిగాని కాల్వ, బొల్లేపల్లి కాల్వ, పెద్ద కాల్వల కట్టల పటిష్టానికి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కన్పించడం లేదు.

ఏటేటా ఇదే నిర్లక్ష్యం..

ప్రతి ఏటా వర్షాకాలంలో మూసీకి తరుచూ వరదలు సంభవించినప్పుడల్లా ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో ఆయకట్టులోని బునాదిగాని కాల్వ, బొల్లేపల్లి కాల్వ, పెద్ద కాల్వ ప్రధాన పంటల కాల్వలకు వరద ఉధృతి పెరుగుతుంది. సామర్థ్యానికి మించి కాల్వల్లో నీటి ప్రవాహం పెరుగుతుంది. దీంతో కాల్వ కట్టలు బలహీనంగా ఉన్నచోట గండ్లు పడి తెగుతున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు మునిగి రైతులకు తీరని నష్టం కలుగుతుంది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం మక్తానంతారం, అటు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా, ఘట్కేసర్ మండలం, అబ్దుల్లాపూరం గ్రామాల సరిహద్దులో ప్రవహించే మూసీని ఆనుకుని ఉన్న మక్తానంతారం కత్వ నుంచి మొదలయ్యే బునాదిగాని కాల్వ దిగువనున్న వెంకిర్యాల, పడమటి సోమారం, రాఘవాపురం, బ్రాహ్మణపల్లి, ముగ్దుంపల్లి, గొల్లగూడెం గ్రామాల వద్ద చిన్నేటి వాగులో కలుస్తుంది. అక్కడితో బీబీనగర్ మండల పరిధి ముగుస్తుంది. పడమటిసోమారం, వెంకిర్యాల, బ్రాహ్మణపల్లి పరిధిలోని అనేక చోట్ల కాల్వ కట్టలు బలహీనంగా ఉన్నాయి. కాల్వకు వరద ప్రవాహం పెరిగినప్పుడల్లా దీంతో ప్రతిఏటా ఈ గ్రామాల పరిధిలో గండ్లు పడుతున్నాయి. రాఘవాపురం, బీబీసాహెబ్ చెరువు నుంచి మొదలయ్యే బొల్లేపల్లికాల్వ ఆయకట్టులో రామునిగుండ్లతండా, గుర్రాల దండి, చిన్నపలుగు, పెద్దపలుగుతండా, రెడ్యానాయక్ తండా, రావిపహాడ్ పరిధిలో, రుద్రవెల్లికత్వ నుంచి భట్టుగూడెం, చింతలచెరువు వరకు గల పెద్దకాల్వ ఆయకట్టులో చిన్నరావులపల్లి పరిధిలో కాల్వ కట్టలు బలహీనంగా ఉన్నాయి.

మరమ్మతులకు నోచుకోక..

బీబీనగర్ మండలంలోని మూసీ ఆయకట్టులో బునాదిగాని, బొల్లేపల్లి, పెద్ద కాల్వలు, ప్రధాన సాగునీటి కాల్వలు. వీటికి సరైన మరమ్మతులు చేపట్టకపోవడంతో కట్టలు బలహీన పడుతున్నాయి. కాల్వల్లో గుర్రపు డెక్కకు పూర్తిగా విస్తరించి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతుంది. కాల్వలకు నీటి ప్రవాహం పెరిగినప్పుడల్లా కాల్వ కట్టలపై నుంచి నీరు పొంగి పొర్లుతుంది. నీటి ప్రవాహ ధాటికి కాల్వ కట్టలు తెగిపోతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. కాల్వ కట్టలను పటిష్ఠం చేసి, నీటి ప్రవాహానికి అడ్డున్న గుర్రపు డెక్కను తొలగించాల్సి ఉంది.



గుర్రపుడెక్కతో నిండిపోయిన కాల్వ

పనులు కావు.. కాల్వలు పారవు



సుమారు రెండేళ్లకు సాగరం వైపు కృష్ణమ్మ తరలివస్తున్న సవ్వడి కర్షకుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. నీరు పోయని బోర్లను చూసి దుఃఖిస్తున్న రైతులకు కృష్ణవేణి ఎగువ కన్నడ ప్రాంతం నుంచి దిగి వస్తున్న జాడలు ఆశలు రేకెత్తిస్తున్నాయి. తొలకరి జల్లులకు దుక్కులు దున్నిన నారుమడులు పోసిన రైతులు మడికి నీరొస్తే నాటు వేయడానికి సిద్ధంగా ఉండి భారీ వర్షాల కోసం, సాగర్ కాల్వ నీటికోసం ఎదురు చూస్తున్నారు. గతంలో ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టిన కాల్వ ఆధునికీకరణ పనులు పూర్తి స్థాయిలో చేయకపోవడం, ప్రస్తుతం జరుగుతున్న మెయిన్ కెనాల్ మట్టి కట్టల లైనింగ్ పనులు పూర్తికావడం లేదు. ఎప్పుడంటే అప్పుడు ఎడమ కాల్వ ద్వారా సాగు నీరువిడుదల చేయడానికి గల అవకాశాలపై ప్రభుత్వం సంబంధిత అధికారుల ద్వారా వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

● మిర్యాలగూడ

ప్రపంచ బ్యాంకుతో కుదిరిన ఒప్పందం మేరకు 48శాతం రాష్ట్ర వాటా రూ.4444.41 కోట్లతో 2010లో సాగర్ కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టారు. కడి, ఎడమ మెయిన్ కెనాల్స్ లైనింగ్, డిస్ట్రిబ్యూటరీ కమిటీల ద్వారా మేజర్ కాల్వలు, వాటర్ యూజర్ అసోసియేషన్ (నీటి సంఘం)ల ద్వారా మైనర్ కాల్వల ఆధునికీకరణ పనులకు తోడు డ్యామ్ మరమ్మతులు, లిఫ్టలకు మెకానికల్, ఎలక్ట్రికల్ మరమ్మతులు తదితర పనులు చేపట్టారు. కాల్వనీటి విడుదల నిలివేసిన సమయంలో పనులు చేపడుతూ 2016లోపు పూర్తిచేయాలనే గడువు విధించినా పనులు పూర్తయ్యే వరకు మరో రెండేళ్ల సమయం పట్టింది.

నాలుగు సబ్‌డివిజన్లు, 65 మేజర్లు

సాగర్ ఎడమకాల్వ హెడ్ రెగ్యులేటర్ నుంచి సొరంగ మార్గం 1.89కిలో మీటర్లు పోను 73.800 వరకు సబ్‌డివిజన్-1, 74 కిలో మీటర్ల నుంచి 133 వరకు సబ్‌డివిజన్-2, 134-180 సబ్‌డివిజన్-3, 21మెయిన్ బ్రాంచ్ కెనాల్ 0-102 వరకు నాలుగు సబ్‌డివిజన్‌లుగా ఏర్పాటు చేశారు. మొత్తం సబ్‌డివిజన్లలో 64మేజర్లతో పాటు 160కి పైగా మైనర్ కాల్వలు ఉన్నాయి. సబ్‌డివిజన్-1లోని 30మేజర్లలో రెండువేల ఎకరాలకుపైగా సాగునీరందించే రాజవరం, సూరేపల్లి, నారెళ్లగూడెం, ముదిమాణిక్యం, వజీరాబాద్, కిష్టాపూర్, ములకలకాల్వతో కలిపి ఆరు మేజర్లు ఉన్నాయి. ప్రధాన ఎడమకాల్వ పరిధిలో తెలంగాణలోని ఆరు నియోజకవర్గాల్లో సాగర్ ఆయకట్టు ఉంది. ఎడమకాల్వ ద్వారా(లిఫ్టలతో కలిసి) నాగార్జునసాగర్ 71.528, మిర్యాలగూడ 82.014, సూర్యాపేట 8,592, హుజూర్‌నగర్ 1,37,623, కోదాడ 60,944, పాలేరు 7,623 ఎకరాలకు నీరు అందుతుంది.

కొనసాగుతున్న కాల్వ లైనింగ్ మరమ్మతులు

మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని 1.89 కిలో మీటర్ల నుంచి 73.800 కి.మి వరకు మెయిన్ కెనాల్ మరమ్మతులకు రూ.15.78 కోట్లు,

కాల్వకట్టల సామర్థ్యం పెంపుపై అశ్రద్ధ

వాగులపై యూటీలను ఏర్పాటు చేసి కాల్వనీరుపై నుంచి ప్రవహించే విధంగా నిర్మించారు. చిన్నచిన్న వాగులపై యూటీలు, మూసీ లాంటి పెద్ద నదులపై అక్విడవిట్‌లు ఏర్పాటు చేసి నదులకు వరదలు వచ్చినా కాల్వ దెబ్బతినకుండా నిర్మించారు. ఎడమ కాల్వపై 1162 యూటీలు నిర్మించారు. వీటిలో కొన్ని యూటీలను ఆధునికీకరించకపోవడంతో లీకేజీలు ఏర్పడ్డాయి. మొదటి జోన్ పరిధిలో మేజర్లకు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో లైనింగ్ పనులు పూర్తిచేసినా ప్రపంచ బ్యాంకు నిధులు ప్రాజెక్టు మరమ్మతుల పేరుతో ఇతర నిర్మాణాలకు ఎక్కువగా ఖర్చుచేసి కాల్వకట్టలకు తగ్గించారు.

- పూర్తికాని కాల్వ ఆధునికీకరణ, మరమ్మతుల పనులు
- డిజైన్ డిచార్జీ కంటే తక్కువ నీటి విడుదలతో నెరవేరని లక్ష్యం

హుజూర్‌నగర్ డివిజన్‌లో 74నుంచి 133 కి.మీ పాలేరు రిజర్వాయర్ వరకు రూ.29 కోట్లతో కెనాల్ బెడ్ లైనింగ్, స్లోప్స్ లైనింగ్ పనులు మంజూరయ్యాయి. ఏప్రిల్ 2022లో కెనాల్ మర్మతులను ఎస్ఎల్ఎన్ఎస్ ఏజెన్సీ దక్కించుకుంది. రూ.2.73కోట్లతో పెద్దదేవులపల్లి రిజర్వాయర్ క్రస్ట్‌గేట్ల మరమత్తుల పనులు చేపట్టిన స్వప్న ఏజెన్సీ ఏడాదిలోగా పనులు పూర్తి చేయాల్సివుండగా 30 శాతం పనులనైనా పూర్తి చేయలేదు. కాగా ప్రభుత్వం మరమత్తుపనులు పూర్తి చేసేందుకు 2024 ఏప్రిల్ వరకు మరో ఏడాదికి గడువు పొడిగించింది. కాగా ఎనిమిది చోట్ల లైనింగ్ మరమ్మతుల పనులు ఇంకా కొనసాగుతుండటంతో సాగర్ ప్రాజెక్టులోకి నీరు చేరితే సరైన సమయంలో కాల్వకు నీటి విడుదల చేస్తారా అని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. . మిర్యాలగూడ మండలం ఐలాపురం 51 మైలురాయి వద్ద మెయిన్ కెనాల్‌కు లైనింగ్ ప్యాచ్ వర్క్ పనులు కొనసాగుతుండగానే మట్టి జారీ లైనింగ్ పూర్తిగా పడిపోవడంతో తిరిగి అక్కడ లూజ్ మట్టిని పూర్తిగా తీసివేసి గట్టిమట్టితో కట్టను పటిష్ఠం చేసి లైనింగ్ వేయడానికి ఎక్కువ వ్యయం, సమయం పడుతుందని అధికారులు భావిస్తున్నారు. 2022 కు ముందు గుర్తించిన పనులు సాగుతుండగానే మరికొన్ని చోట్ల లైనింగ్ దెబ్బతినడంతో అధికారులు మరో 30 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. ఖమ్మం సబ్‌డివిజన్ 3లో 4 చోట్ల గేట్లకు బిగించిన ఇత్తడి పరికరాలను దొంగలు ఎత్తుకెళ్లడంతో తిరిగి వాటిని బిగించేందుకు రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలుస్తోంది.

డిజైన్ డిశ్చార్జీ కంటే తక్కువ నీరు విడుదల

1955లో ప్రధాని నెహ్రూ డిసెంబరు 10న సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయగా 12 ఏళ్ల తర్వాత ప్రధాని ఇందిరాగాంధీ 1967 ఆగస్టు 4న కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేశారు. ఎడమకాల్వ డిజైన్ ప్రకారం పూర్తి స్థాయిలో 11వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉంది. ఎడమకాల్వ ఆయకట్టు స్థిరీకరణ 10,37,796 ఎకరాలు కాగా నల్లగొండ, ఖమ్మం జిల్లాలో 6,62, 580 ఎకరాల ఆయకట్టు ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనుముల, నిడమనూరు, త్రిపురారం, దామరచర్ల, మిర్యాలగూడ, వేములపల్లి, పెన్‌పహాడ్, నేరేడుచర్ల, మట్టంపల్లి, హుజూర్‌నగర్, గరిడేపల్లి, చిలుకూరు, నడిగూడెం, మునగాల, కోదాడ మండలాల్లోని భూములకు సాగునీరు అందుతుంది. కాల్వ కట్టల మరమ్మతుల కారణంగా ఏ రోజూ పూర్తిస్థాయి నీటి విడుదల జరగలేదు. 8 నుంచి 9వేల క్యూసెక్కుల వరకు మాత్రమే అధికారులు నీటిని విడుదల చేస్తూ వచ్చారు. మేజర్లకు నీటి పారుదల ప్రాంతాన్ని బట్టి 85 నుంచి 90 క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేయాల్సివుండగా 80 క్యూసెక్కుల కు మించి విడుదల చేయలేదని తెలుస్తోంది. దీంతో టేలం డ్ భూములకు సాగునీటి కొరత ఏర్పడుతోందని రైతులు ఆరోపిస్తున్నారు.

వరద ముంచెత్తుతున్నా పట్టింపు కరువు



మరమ్మతులకు నోచక అధ్వానంగా ఉన్న పిల్లాయిపల్లి కాల్వ

భూదాన్‌పోచంపల్లి: హైదరాబాద్ రంగారెడ్డి పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మూసీ ఆయకట్టు ప్రాంతమైన భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, వలిగొండ మండలాల్లోని కాల్వలు పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని కాల్వలు వర్షపు నీటికి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఈ మూడు చిన్న కాల్వల ద్వారా భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, వలిగొండ, చౌటుప్పల్, రామన్నపేట, చిట్యాల, ఆత్మకూర్(ఎం), మోత్కూర్ తోపాటు పది మండలాల్లో లక్షల ఎకరాల భూమిలో వరి సాగు చేస్తున్నారు. మూసీ ఆయకట్టు కాల్వల మరమ్మతుల విషయంలో గత పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షాకాలంలో వరదలు ముంచెత్తుతుండటంతో ఈ కాల్వల పరీవాహకంలో ప్రమాదం పొంచిఉంది. మూసీ కాల్వలకు మరమ్మతులు చేపడతామని ఎన్నికల ముందు అన్ని పార్టీలూ ప్రకటనలు చేయడమే తప్ప ఆ తర్వాత వాటి ఊసే ఎత్తని పరిస్థితి 20 ఏళ్లుగా సాగింది. 2006లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పిలాయిపల్లి కాల్వ ద్వారా రైతాంగానికి సాగు నీరు అందించేందుకు కాల్వ మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. పిలాయిపల్లి కాల్వ మరమ్మతుల కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.23.52 కోట్లు వెచ్చించి కాల్వ పనులు ప్రారంభించింది. ఈ కాల్వ ఆయకట్టు కింద పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట, చిట్యాల మండలాల వరకు కాల్వ పనులు చేపట్టారు. పోచంపల్లి మండలంతోపాటు చౌటుప్పల్, రామన్నపేట మండలాల వరకు కొంత సాగునీరు అందించినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో సాగునీరు అందక ఈ ప్రాంత భూములు బీడు భూములుగానే మిగిలిపోయాయి.

ఏళ్లు గడుస్తున్నా..

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో అప్పటి సీఎం కేసీఆర్ పిలాయిపల్లి, బునాదిగాని, ధర్మారెడ్డిపల్లి కాల్వల మరమ్మతుల కోసం సుమారు రూ.280 కోట్లు కేటాయించారు. ఏళ్లు గడుస్తున్నా ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. పిలాయిపల్లి కాల్వకు మరమ్మతులు, విస్తరణ పనులు చేపట్టలేదు. మూసీ ఆయకట్టు ప్రాంతంలోని పిలాయిపల్లి, నారాయణగిరి కత్వాల వద్ద తరుచూ వరద ఉధృతి వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మూసీ ఆయకట్టులోని భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి కాల్వ కింద పసిలాయిపల్లి, జగత్‌పల్లి, పెద్దగూడెం, జూలూరు, నారాయణగిరి, జలాల్‌పూర్, మెహర్‌నగర్, భీమనపల్లి, కనుముకుల, వంకమామిడి, శివారెడ్డిగూడెం, ఇంద్రియాల, ముక్తాపూర్, పోచంపల్లి, రేవణపల్లి, గౌసుకొండ, పెద్దరావులపల్లి తదితర గ్రామాలున్నాయి. ఈ కాల్వ కింద మూసీ ఉధృతితో చెరువులు నిండి ప్రవహిస్తున్నాయి.



యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని మూసీ వరద నీరు ప్రవాహ ఉధృతి

గుర్రపు డెక్క.. నీటి ప్రవాహానికి అడ్డుకట్ట



కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు (ఫైల్)

వరదొస్తే.. కడగండ్లే



వలిగొండ: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షం కారణంగా మండలంలో మూసీ నదీలోకి భారీగా వరద నీరు చేరుతోంది. మూసీ నీరు దిగువ ప్రాంతం గ్రామాల రైతుల వ్యవసాయానికి సాఫీగా అందక, అనేక అడ్డంకులు ఎదురువుతున్నాయి. దీంతో రైతులు చాలా సంవత్సరాల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా సాగు నీటి కాల్వలపై పాలకులు దృష్టి సారించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి, బునాదిగాని కాల్వల పునరుద్ధరణకు గతంలో మాజీ సీఎం కేసీఆర్ రూ.300 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. వరదనీరు చివరి రైతు పొలం వరకు సక్రమంగా చేరాలంటే సాగునీటి కాల్వలను ఆధునికీకరించాలని రైతులు కోరుతున్నారు. పోచంపల్లి మండలంలో ప్రారంభమైన ధర్మారెడ్డిపల్లి కాల్వ వలిగొండ మీదుగా రామన్నపేట, చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల వరకు సాగుతుంది. ఈ కాల్వ చాలా కిలోమీటర్ల పొడవు ఉంటుంది. వలిగొండ మండలంలో సంగెం, వర్కట్‌పల్లి, గోకారం, బొల్లేపల్లి గ్రామాల పరిధిలో సుమారు 25కిలో మీటర్లు సాగుతుంది. వందల ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. అనేక చెరువులను ఈ నీటితో నింపుకుంటూ సాగుతుంది. ఈ కాల్వ కింద రైతులు రెండు పంటలు సాగు చేస్తారు.

శిథిలావస్థకు చేరిన కల్వర్టులు

ధర్మారెడ్డిపల్లి కాల్వ కల్వర్టులు శిథిలావస్థకు చేరాయి. వరద నీరు భారిగా వస్తే కాల్వకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. నీటి ప్రవాహాన్ని నియంత్రించడానికి షట్టర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. గతంలో ఈ కాల్వకు గండ్లు పడి రైతుల పంటలు దెబ్బతిన్నాయి. వర్కట్‌పల్లి, గోకారం, గ్రామల వద్ద చౌటుప్పల్ ప్రధాన రహదారిపైన సయిడ్‌వాల్స్ కూలిపోయాయి. వరదనీరు అధికంగా రావడం వల్ల పొలాలకు వెళ్లే రైతులకు, ప్రయాణి కులకు రాత్రి సమయాల్లో ప్రాణహాని, ఆస్తి నష్టం జరిగే అవకాశ ముంది. అధికారులు ముందస్తు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం లేదని విమర్శ ఉంది. ఈ కాల్వల వద్ద చెత్తాచెదారం చేరి వరద ఉధృతికి తెగిపోయే ప్రమాదముంది. ఈ కాల్వలకు గత ప్రభుత్వాలు తాత్కలిక మరమత్తులు చేయించి చేతులు దులుపుకున్నాయి.

భీమలింగం కాల్వ

ఏదుళ్లగూడెం గ్రామం నుంచి ప్రారంభమైన భీమలింగం కాల్వ మండలంలో సుమారు 40కిలో మీటర్ల పొడవున సాగుతుంది. గతంలో ఈ కాల్వ పునరుద్ధరనకు టెండర్‌ను దక్కించుకున్న క్రాంటాక్టర్ పనులు పూర్తి చేయలేక మధ్యలోనే చేతులు ఎత్తేశాడు. దీంతో కాల్వ కింద భూములు సాగుచేసే రైతులకు ఇబ్బందులు కలిగాయి. భీమలింగం కాల్వను ఆధునికీకరించాలని ప్రతిపకాలు ధర్నాలు చేసినా ఫలితం కనబడలేదు.

పేరుకుపోతున్న గుర్రపు డెక్క

ఈ కాల్వ పొడవునా గుర్రపు డెక్క పేరుకుపోయింది. చివరి పొలాలకు నీరందక రైతులు అనేకసార్లు ఆందోళనలు చేశారు. సమస్యలు గుర్తించిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తమ సొంత నిధులతో గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటితో పాటు గుర్రపు డెక్క కాల్వలోకి వచ్చి నీటి ప్రవాహానికి అడ్డు పడుతోంది.

ఆసిఫ్‌నగర్ కాల్వ

నెమలి కాల్వ పరిధిలో గతంలో మూసీ నదీలపై ఆసిఫ్‌నగర్ కాల్వను నిర్మించారు. ఈ కాల్వ నాగారం మీదుగా ఐదు కిలోమీటర్ల దూరంలో రామన్నపేట మండలంలోకి చేరుతుంది. ఈ కాల్వ పొడవునా గుర్రపుడెక్క వ్యాపించి ఉండడంతో నేటి ప్రవాహం సాఫీగా జరగడం లేదు. మూసీ నది నీటిని వ్యవసాయనికి అందించడానికి ధర్మారెడ్డిపల్లి, భీమలింగం ఆసిఫ్‌నగర్ కాల్వలు నిర్మించారు. ఈ కాల్వల కింద వేల ఎకరాలు సాగవుతున్నాయి. సంవత్సరానికి రెండు పంటలు సాగు చేస్తున్నారు. ఈ కాల్వలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని పెట్టి, అధిక నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.



గోకారంలో కూలిన కాల్వ సైడ్‌వాల్

కాల్వలను ఆధునికీకరించాలి



సాగునీటి కాల్వలను ప్రభుత్వం ఆధునికీకరించాలి. శిథిలావస్థకు చేరిన కల్వర్టు, షెటార్లు కాల్వల కట్టలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాలి. ప్రమాదకరంగా ఉన్న కాల్వల సైడ్‌వాల్స్ వెంటనే నిర్మించాలి. దీర్ఘకాలికంగా రైతులకు ఉపయోగపడే విధంగా కాల్వలపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. వర్షం కురుస్తుంది అనగానే రైతులలో ఆందోళన మొదలు అవుతుంది. ఈ కాల్వల మరమ్మతులు వేగవంతం చేయాలి.

● తుర్కపల్లి సురేందర్, రైతు, గోకారం.

చేనేత సంఘాలకు ఎన్నికలేనా?

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు కలగానే మిగులుతున్నాయి. 2013లో ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. 2018 ఫిబ్రవరి 12వ తేదీతో చేనేత సహకార సంఘాల గడువు ముగిసింది. పాత పాలకవర్గాలకే పర్సన్ ఇన్‌చార్జీల బాధ్యతలు అప్పగిస్తూ వస్తోంది. 11 ఏళ్లుగా సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా గత ప్రభు త్వం నిర్లక్ష్యం చేసింది. పర్సన్ ఇన్‌చార్జీలతో సంఘా లు మొక్కుబడిగా నడుస్తుండగా, క్యాష్ క్రెడిట్ అం తంత మాత్రమే ఉన్నా పలు సంఘాలు మూతపడేపరిస్థితికి చేరుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం పదికి మించి సంఘాల కార్యకలాపాలు సాగడం లేదు.

- భూదాన్‌పోచంపల్లి

» చేనేత సహకార సంఘాలకు, టెస్కోకు ఎన్నికలు జరిగి 11 ఏళ్లు



యాదాద్రిభువనగిరి జిల్లాలోని భూదాన్‌పోచంపల్లి లాంటి పెద్ద చేనేత సహకార సంఘంలో పర్సన్ ఇన్‌చార్జిగా ఏడీవోను నియమించి సంఘాల నడిపిస్తున్నారు. సంఘాల నిర్వహణపై అజమాయిషీ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని సంఘాల్లో వందలాది పట్టు చీరలు మాయమైనట్లు విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత సహకార సంఘాలకు, వాటి మాతృసంస్థ టెస్కో'కు సైతం ఎన్నికలు నిర్వహించాలని చేనేత వర్గాలు కోరుతున్నాయి.

ఎన్నికలు లేక చేనేత సహకార సంఘాలు డీలా

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి సంఘాలను బలోపేతం చేస్తే కార్మికులకు పని దొరుకుతుం ది. మార్కెటింగ్ అవకాశాలు పెంపొందించుకోవడంతో కార్మికులకు గిట్టుబాటు లభిస్తుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా లో చేనేత సహకార, పవర్‌లూమ్‌లు కలిపి మొత్తం 84సహకార సంఘాలున్నాయి. ఇందులో 25,900 మంది కార్మికులు ఉన్నారు. యాదాద్రి-భువనగిరి జిల్లాలో మొత్తం 44 చేనేత సహకార సం ఘాలు,ఏడు పవర్‌లూమ్ సంఘాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 18,852 మంది కార్మికులు ఉన్నారు. మగ్గం నేసే కార్మికులు 6,294 మంది ఉండగా, చేనేత అనుబంధ రంగంలో పనిచేస్తున్నవారు మరో 12,600 మంది ఉన్నారు. నల్లగొండ జిల్లాలో 25 చేనేత సహకార సంఘాలు, ఐదు పవర్‌లూం సంఘాలు ఉన్నాయి. ఇందులో సుమారు 6,580 మంది కార్మికులు ఉన్నారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం మూడు చేనేత సహకార సంఘాలున్నాయి. ఇందు లో 320మంది కార్మికులు పనిచేస్తున్నారు. మగ్గం నేసే కార్మికులు 110 మంది ఉండగా, అనుబంధ రంగంలోని కార్మికులు 210మంది ఉన్నారు. 2018లో ఎన్నికల నిర్వహణ కోసం సం ఘాల్లో సభ్యత్వం కలిగిన వారందరికీ పాస్ బుక్‌లు ఇచ్చి వాటి ఆధారం గా, ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాను సైతం తయారు చేసింది. నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు.

పాలకవర్గాలతోనే ఆర్థిక పరిపుష్టి

చేనేత సహకార సంఘాలకు పాలకవర్గాలు ఉంటే చేనేత కార్మికులకు ప్రయోజనం ఉంటుంది. వారు తీసుకునే నిర్ణయాలతో సంఘాలు ఆర్థికంగా బలోపేతమవుతాయి. తద్వారా కార్మికులకు చేతినిండా పనికల్పించే వీలుంటుంది. నూలు, రంగులు, రసాయనాలను కార్మికులకు సబ్సిడీపై అందించవచ్చు. ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు, రుణాలు అందించడంతోపాటు సహకార సంఘాలు కూడా కార్మికులకు వ్యక్తిగతంగా రుణాలు అందించే అవకాశాలు ఉంటాయి.

ఇన్‌చార్జీల పాలన ఇష్టారాజ్యం

చేనేత సంఘాలకు పదకొండేళ్లుగా ఎన్నికలు లేవు. గతంలో ఆప్కో ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రపదేశ్‌లో ప్రతి మూడు నెలలకోసారి కొనుగోళ్లు జరిగేవి. కేవలం సహకార సంఘాల్లోనే ప్రొక్యూర్‌మెంట్ ఇచ్చేవారు. దీంతో సంఘాలు ఆర్డర్‌పై కార్మికుల చేత వస్త్రాలు నేయించే వారు. క్యాష్ క్రెడిట్‌పై సంఘాలు బ్యాంకుల్లో రుణాలు తీసుకుని కార్మికులకు పని కల్పిస్తూ వస్త్రోత్పత్తులను ఆప్కోకు అమ్మేది. వారు ప్రతి ఆరు నెలలకోసారి కొనుగోలు చేసిన వస్త్రాలకు డబ్బులు చెల్లించే వారు. తదుపరి ఆర్డర్ ఇచ్చి మళ్లీ ప్రొక్యూర్‌మెంట్ కల్పించేది. దీంతో సహకార సంఘాలు కార్మికులకు చేతి నిండా పని కల్పిస్తూండేవి. పదేళ్ల క్రితం బీఆర్ఎస్ హయాంలో టెస్కోను ఏర్పాటు చేశారు. ఎన్నికల నినాదంగా నామమంత్రంగా ప్రొక్యూర్‌మెంట్ ఇచ్చి సంఘాలకు ఆర్డర్ ఇచ్చిన ట్లు వ్యవహరించేది. చేనేత సహకార సంఘాలన్నీ పని కల్పించలేని స్థితికి చేరుకున్నాయి. నిర్వహణపై పర్సన్ ఇన్‌చార్జిలను పెట్టడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కొన్ని సంఘాల్లో వందలాది చీరలు మాయమయ్యాయి. చేనేత సహకార సంఘాల్లో పేరుకుపోయిన వస్త్రాలను కొనుగోలు చేయడంలో టెస్కో విఫలమైంది. కాగా, సంఘాల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై 51 ఎంక్వైరీ వేశారు. విచారణ తీవ్ర జాప్యం జరుగుతుండటంతో మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నిక సమయంలో 51 ఎంక్వైరీ రద్దు చేసింది.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వ హించ కుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. పాలక వర్గాలు లేక పదకొండేళ్లు దాటినా ఎన్ని కలు నిర్వహించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోంది. దీంతో కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. పాలకవర్గాలు ఉంటే తమ సమస్యలు విన్నవించుకునే వీలుంటుంది. కార్మికులకు, సంఘానికి ప్రయోజనం కలుగుతుంది.

- వెంకటేష్, చేనేత కార్మికుడు, భూదాన్‌పోచంపల్లి

సంక్షోభంలో చేనేత సంఘాలు



ఉమ్మడి జిల్లాలోని చేనేత సంఘాలన్నీ పాలకవర్గాలు లేక పోవడంతో సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. చేనేత కార్మికులకు పని కల్పించలేని స్థితిలో ఉన్నాయి. వందల సంఖ్యలో ఉన్న సంఘాలు నేడు మూతపడుతున్నాయి. పదుల సంఖ్యలో మాత్రమే అంతంతం మాత్రంగా సంఘాలు భారంగా నడుస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి. కార్మికులకు పని కల్పించేందుకు సంఘాలను బలోపేతం చేయాలి.

- భారత వాసుదేవ్, ఉమ్మడి జిల్లాల చేనేత సహకార సంఘాల నాయకుడు

చౌటుప్పల్ సహకార సంఘంలో వివాదం

చౌటుప్పల్ చేనేత సహకార సంఘంలో కొత్త సభ్యత్వాల నమోదు వ్యవహారం వివాదమైంది. పర్సన్ ఇన్‌చార్జి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. పర్సన్ ఇన్‌చార్జిగా కందగట్ల భిక్షపతి వ్యవహరిస్తున్నారు. సంఘంలో మొత్తం 520మంది వరకు సభ్యత్వాలు ఉన్నాయి. సంఘానికి ప్రస్తుతం కేవలం 50మందికి మాత్రమే పనికల్పిస్తున్నారు. సహకార సంఘం ద్వారా టెస్కో సంస్థ కొనుగోలు చేసిన రూ.5లక్షల బకాయి డబ్బులు చెల్లించినట్లు సంఘం పర్సన్ ఇన్‌చార్జి తెలిపారు. జూన్ 5న పర్సన్ ఇన్‌చార్జి అధ్వర్యంలో పాలకవర్గ సమావేశం నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా కొందరిని వాటాదారులు(సభ్యులు)గా తీసుకోవాలని తీర్మానించారు. ప్రస్తుతం సంఘంలో ఉన్న సభ్యులకే పని కల్పించలేని స్థితిలో కొత్తగా, ఏకపక్షంగా సభ్యత్వం కల్పించడంపై చేనేత కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ వ్యవహారాన్ని చేనేత కార్మికులు చేనేత, జౌళి శాఖ కమిషనర్, జిల్లా ఏడీ విద్యాసాగర్ దృష్టికి తీసుకెళ్లారు. తీసుకెళ్లి సంఘం ఎదుట ధర్నా నిర్వహించారు. పర్సన్ ఇన్‌చార్జి, డైరెక్టర్లకు, చేనేత కార్మికుల మధ్య వాగ్వాదం జరిగింది. ఇరువర్గాలూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి. సంఘం ఆస్తులను విక్రయించేందుకు కుట్ర చేస్తున్నారని, పాలక వర్గాన్నిరద్దు చేయాలని కోరుతూ జూన్ 16న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆర్డీవో శేఖర్‌రెడ్డికి కార్మికులు వినతిపత్రాలు అందజేశారు. దీనిపై జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ విచారణ నిర్వహించారు. 13మంది కొత్త వాటాదారులను తొలగించామని, కొత్తగా వాటాదారులుగా తీసుకునే అధికారం పర్సన్ ఇన్‌చార్జికి లేదని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

కుంటలకు జలకళ

» ముమ్మరంగా వ్యవసాయ పనులు » ముసురుతో రైతుల్లో ఆనందం



అర్వపల్లిలో మండల కేంద్రంలో నిండిన బతుకమ్మ కుంట

కోదాడ రూరల్, జూలై 21:మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. బావులు, చెరువులు, కుంటల్లో నీరు చేరుతున్నందున రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నారు పోసిన రైతులు నాట్లకు సిద్ధం అవుతుండగా, నారు పోయని రైతులు నారు పోసేందుకు సిద్ధమవుతున్నారు. వర్షాలతో కృష్ణా నదిలో జల ప్రవాహం రావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మండలంలోని పాలేరు వాగుతో పాటు పలు అంతర్గత వాగులు ప్రవహిస్తున్నాయి. వర్షాలు మరో మూడు రోజుల పాటు కొనసాగితే చెరువుల్లోకి పూర్తి స్థాయిలో నీరు రావడంతో భూగర్భ నీటి మట్టం పెరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తిరుమలగిరి, తిరుమలగిరి రూరల్: మునిసిపాలిటీ పరిధిలో రెండో రోజులుగా ముసురు పట్టింది. ఈ వర్షం పంట పొలాలకే మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు లేనందున వీధులన్నీ బురదమయంగా సుందరయ్యకాలనీ, జంగాలకాలనీల్లో రోడ్లపై నడిచే పరిస్థితి లేదని, ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

● ముసురుతో తిరుమలగిరి మండలంలోని పలు గ్రా మాల రోడ్లు బురదమయంగా మారాయి.తొండ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డు నడవలేనివిధంగా ఉందని, పాఠశాలకు ఎలా వెళ్లాలని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి స మస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన్‌కల్: మండలంలో ముసురుతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లోని పలు వీధులు చిత్తడిగా మారాయి.

అర్వపల్లి: అర్వపల్లి మండల వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు జలకళతో సంతరించుకున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అర్వపల్లి బతుకమ్మకుంట నిండి అలుగుపోస్తుంది. రామన్నగూడెం, పర్సాయపల్లి గ్రామాల చెరువుల్లోకి వర్షపునీరు చేరుతోంది.



తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో బురదమయంగా ఉన్న ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డు



ఆత్మకూర్(ఎస్) మండలంలోని తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో ఏర్పడిన గుంతలు

ఆత్మకూర్(ఎస్): మండలంలో వర్షాలకు పలు రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

మునగాలలో గరిష్ఠంగా 20.1మి.మీ వర్షపాతం

సూర్యాపేటటౌన్: జిల్లాలో రోజంతా ముసురు కురిసింది. ముఖ్యంగా మూడు రోజులుగా వర్షం కురుస్తునే ఉంది. ఆదివారం రోజంతా వర్షం కురిసింది. జిల్లాలో గరిష్ఠంగా మునగాలలో 20.1 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. అదేవిధంగా కనిష్ఠంగా పాలకవీడులో 3.1మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. చిలుకూరులో 15.4, జాజిరెడ్డిగూడెంలో 14.7, ఆత్మకూర్(ఎస్)లో 14.6, నాగారంలో 14.4, కోదాడలో 13.6, తిర్మలగిరిలో 13.4, మోతెలో 12.7, సూర్యాపేటలో 12.1, మద్దిరాలలో 11.1, అనంతగిరిలో 10.9 హుజూర్‌నగర్‌లో 10.1, నూతన్‌కల్‌లో 10.0, పెన్‌పహాడ్‌లో 9.9, గరిడేపల్లిలో 9.4, నేరేడుచర్లలో 8.9, మట్టంపల్లిలో 7.4, మేళ్లచెర్వులో 7.2, చింతలపాలెంలో 4.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో 11.4 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

రుణమాఫీలో మండలవాసి కీలక పాత్ర



శైలజను అభినందిస్తున్న సీఎం, మంత్రులు

మేళ్లచెర్వు, జూలై 21: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రుణమాఫీ, రైతు బంధు, రైతుబీమా ప్రక్రియల్లో మండల కేంద్రానికి చెందిన బండారుపల్లి శైలజ కీలక పాత్ర పోషించారు. హైదరాబాద్‌లోని (యన్ఐసి) నేషనల్ ఇన్ఫర్‌మాటిక్స్ సెంటరులో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శైలజ రాష్ట్ర వ్యాప్తంగా బ్యాంకర్ల నుంచి వచ్చిన డేటాను సేకరించి ప్రభుత్వ జీవ ప్రకారం అర్హులైన రైతులను సకాలంలో ఎంపిక చేసినందుకు సచివాలయంలో ఈ నెల 18న జరిగిన రుణమాఫీ జరిగిన సందర్భంగా శైలజను సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం:బీజేపీ

గరిడేపల్లి, హుజూర్‌నగర్, జూలై 21:ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందిన బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా శ్రీలతారెడ్డి అన్నారు. ఆదివారం గరిడేపల్లి, హుజూర్‌నగర్ మండల కేంద్రాల్లో జరిగిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. దీని ఫలితంగానే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ సీట్లు సాధించిందన్నారు.ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ ఒత్తిడి తెస్తుందన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింగ్ అంజయ్య, నాయకులు పోకల వెంకటేశ్వర్లు, జనిగల శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, పొలిశెట్టి అంజయ్య, రామినేని కృష్ణయ్య, చిత్తలూరి సోమయ్య, మోదాల గంగాధర్, సందీప్, రాజ్‌నాయక్, సైదులు, రాధాకృష్ణ, నరేందర్‌రెడ్డి, ఇంటి గోపి, బంటు నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేది గురువులే



సాయిరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్, జూలై 21: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేది గురువులే నని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఉపాధ్యాయుడు తీకుళ్ల సాయిరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని అన్నారు. సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులకే ఉందని కొనియాడారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, ప్రముఖ విద్యావేత్త యానాల వెంకటరెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, కె.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూ జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక

కోదాడ, జూలై 21: ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) జిల్లా నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని లాల్‌బంగ్లాలో ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా మేకల రాజేశ్వరి, ఉపాధ్యక్షులుగా బయ్య జయలక్ష్మి, అల్లుబెల్లి వాణిశ్రీ, ప్రధాన కార్యదర్శిగా కంచర్ల నరసమ్మ, సహాయ కార్యదర్శులుగా పులుసు సుజాత, రామలింగమ్మ, కోశాధికారిగా గంట కావ్య, కార్యవర్గ సభ్యులుగా సైదమ్మ, ఐలమ్మ, మల్లేశ్వరి, జయసుధ, విసంతోష, ఆమని, లింగమ్మ, మంగమ్మ, లక్ష్మి, శాంతమ్మ నీలమ్మను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గంతో రాష్ట్ర అధ్యక్షురాలు జి. ఝాన్సీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్.సీత పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సూర్యాపేట టౌన్, జూలై 21: జిల్లా కేంద్రంలోని ప్రైవేటు హోటల్‌లో జిల్లా కేంద్రానికి చెందిన సరస్వతి ఉన్నత పాఠశాల 2001-02బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నృత్యాలు చేశారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య, మధుసూధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, లచ్చిరెడ్డి, మురళీకృష్ణ, విక్రమ్‌రెడ్డి,పాల్గొన్నారు

గంగమ్మకు బోనాలు

మేళ్లచెర్వు, జూలై 21: చింతలపాలెం మండల కేంద్రంలో గంగమ్మకు ప్రజలు గురువారం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. గ్రామంలో ప్రజలు ఆదివారం మేళతాళాలతో ఊరేగింపుగా బోనాలు ఎత్తుకుని ఆలయానికి వెళ్లి గంగమ్మకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

'రైతును రాజును చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమే'

తుంగతుర్తి మఠంపల్లి, జూలై 21: రైతును రాజును చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞాన సుందర్ అన్నారు. రైతులకు రుణ మాఫీ చేసినందుకు ఆదివారం తుంగతుర్తి మండలంలోని బాపబన్‌బాయితండాలో, మఠంపల్లి మండలంలోని పాతదొనబండతండాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భూక్య కోటేష్‌నాయక్, వెంకన్న, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

రూ.50వేల విలువైన గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

మఠంపల్లి, జూలై 21: మండల కేంద్రం నుంచి నేరేడుచర్లకు గుట్కా ప్యాకెట్లను తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్లకు గ్రామానికి చెందిన పాన్‌షాపు వ్యాపారి షేక్ నజీర్ ద్విచక్ర వాహనంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పిడుగురాళ్ల నుంచి గుట్కాలను తీసుకొస్తుండగా, మఠంపల్లిలోని జాన్‌పహాడ్ రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తూ పట్టుకున్నారు. రూ.50వేల విలువైన గుట్కాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

నేరేడుచర్ల, జూలై 21: పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేసి 100గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం...నేరేడుచర్లలోని ఓ రైస్ మిల్లు వెనుక భాగంలో ఎస్ఐ రవీంద్రనాయక్, పోలీస్ సిబ్బంది తనిఖీలు చేసి దామెరచర్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రం, మధుబాని జిల్లా ఖాజులి తాలూకా దాతూర్ లక్ష్మీపూర్‌కు చెందిన రాంచంద్రమహార్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఖుషినగర్ జిల్లా నారాయిపూర్ తాలూకా భజింతపూర్ గ్రామానికి చెందిన సునీల్‌ప్రసాద్, మేళ్లచెర్వు మండలం హేమ్లా తండాకు చెందిన ధరావత్ ముఖేష్, పాలకవీడు మండలం మీగడంపాడు తండాకు చెందిన మాలోతు సంతోష్, మఠంపల్లి మండలం మంచాతండాకు చెందిన రూపావత్ సాయికుమార్(19) అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుల నుంచి 100గ్రాముల గంజాయి, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఏడు కోడె దూడలు పట్టివేత

కోదాడ రూరల్, జూలై 21: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న ఏడు కోడె దూడలను పోలీసులు పట్టుకున్నారు. రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రాలో ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతల్ గ్రామం నుంచి టాటా ఏస్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఏడు కోడె దూడలను అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఆదివారం పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోడె దూడలను గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

జిల్లాలో ఆదివారం భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో దేవతామూర్తుల దర్శనానికి భక్తులు బారులు తీరారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సూర్యాపేటఅర్బన్, చివ్వెంల జూలై 21: జిల్లా కేంద్రంలో సాయిబాబా దేవాలయంతో పాటు పలు దేవాలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. సూర్యాపేటలోని సాయినగర్ సాయిబాబా దేవాలయంలో, ఇండస్ట్రియల్ ఏరియాలోని సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ గురువులకు కృతజ్ఞతలు చెప్పుకోవడానికి నిర్వహించుకునే పండుగ గురుపౌర్ణమి అని అన్నారు. . చివ్వెంల మండలంలోని ఉండ్రుగొండ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో హోమం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కిరణ్ కుమారాచార్యులు, కృష్ణమాచార్యులు మాట్లాడుతూ ఆషాడ మాస పౌర్ణమి పురస్కరించుకుని దంపతులతో హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

హుజూర్‌నగర్: పట్టణంలోని సాయిబాబా దేవాలంయలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 12గంటల వరకు అన్నమయ్య భజన మండలి ఆధ్వర్యంలో సాయిబాబా భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు త్రిపురమళ్ల అంజయ్య, ఓరుగంటి నాగేశ్వరావు, శేఖర్, రాము, గజ్జి ప్రభాకర్‌రావు, రామ్మోహన్‌రావు, కొత్త శ్రీనివాసు, భిక్షం, రాము, తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలంలో మట్టపల్లి క్షేత్రంలోని వేద పాఠశాలలో విద్యార్థులు వేద పారాయణం నిర్వహించి అధ్యాపకుకు పవన్‌కిషోర్‌శర్మకు పాదపూజ చేసి ఆశీర్వచనాలు స్వీకరించారు.

నేరేడుచర్ల: గురుపౌర్ణమి వేడుకలను నేరేడుచర్ల పట్టణ, మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక శ్రీసాయి అన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలోని సాయిబాబా దేవాలయంలో వేద పండితుడు శివప్రసాద్‌శర్మ, రవి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు: మండల కేంద్రంలోని సాయిబాబా మందిరంలో పూజలు నిర్వహించి, గురువును సన్మానించారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్‌శర్మ, రమణకుమార్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: పట్టణంలోని ఆజాద్‌నగర్ సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలను శ్రీసత్యసాయి సేవా సమితి నిర్వాహకులు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలను కనుల పండుగగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో యోగానందరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోదాడ రూరల్: మండలంలోని నల్లబండగూడెం, తమ్మర, కొమరబండ గ్రామంలోని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నల్లబండగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు మాజీ ఎంపీపీ మల్లెల రాణిబ్రహ్మయ్య, జడ్పీటీసీ కృష్ణకుమారి తదితరులు హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమానికి ఆలయ కమిటీ అధ్యక్షుడు నల్లపాటి నరసింహారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముండ్రా రంగారావు, ఏదులాపురం శ్రీనివాసరావు, ముండ్ర రమేష్, శరభేశ్వరరావు, నారాయణ, సుందర్‌రావు, బొల్లు రాంబాబు, ఆదినారాయణ, ఆలేటి రాంబాబు పాల్గొన్నారు.



సూర్యాపేటలోని బాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

చిలుకూరు: మండలంలోని బేతవోలు, చిలుకూరు, నారాయణపురం, ఆచార్యులగూడెం, రామాపురం తదితర గ్రామాల్లో గురుపౌర్ణమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిలుకూరుఅభయాంజనేయస్వామి దేవాలయంలోని సాయిబాబా విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తుంగతుర్తి: మండలంలోని దేవునిగుట్టతండా సమీపంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబాకు క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు, పల్లకి సేవ నిర్వహించారు. తదనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గుగులోతు బాలాజీ దంపతులు, ఎస్ఐ ఏడుకొండలు పాల్గొన్నారు.

అర్వపల్లి: అర్వపల్లి సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన పూజలకు తుంగతుర్తి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కడియం రాంచంద్రయ్య హజరయ్యారు. కార్యక్రమంలో కిశోర్‌బాబు, అర్చకులు శంకర్ కృష్ణ, శంకర్, భక్తులు పాల్గొన్నారు.

● జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం గ్రామ శివారులోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో సౌర హోమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సౌర ఆరాధకుడు జనార్దన్‌స్వామి, అర్చకులు రామశర్మ, వేణుగోపాల్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.



మేళ్లచెర్వు సాయిబాబా మందిరంలో గురువులను సన్మానిస్తున్న పూజారులు



నేరేడుచర్ల సాయిబాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



మట్టపల్లి వేద పాఠశాలలో గురు పూజోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

వాయువు అందక.. ఆయువు పోయింది

● 22 అడుగుల లోతు బావిలో కౌలు రైతు మృతి
● సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో విషాదం

మునగాల, జూలై 21: వరి సాగుకు నారు సిద్ధం చేసుకున్నాడు... దుక్కి దున్నేందుకు అవసరమైన నీటికి బోరుబావే ఆధారం... కౌలుకు తీసుకున్న భూమిలో బోరుబావి ఉండటంతో అందులో దిగాడు.. 22అడుగుల లోతులో శ్వాసక ఆడక ఓ రైతు ప్రాణం పోగొట్టుకున్నాడు. ఆదివారం మునగాల మండలం కలకోవలో ఈ విషాదం నెలకొంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకోవ గ్రామానికి చెందిన కొమర్రాజు లక్ష్మయ్య అలియాస్ లచ్చయ్య (50)కు గ్రామంలో ఎకరం పొలం ఉంది. మరో 10ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. నాన్ ఆయకట్టు ప్రాంతం కావడంతో బోరు బావులే ఆధారం. అయితే గతంతో ఉన్న పాత బావిలో బోరు ఉంది. ఆ బోరు చుట్టూ మూడు అడుగుల వెడల్పు ఉన్న 22 గునలు అమర్చి మిగతా ప్రదేశాన్ని పూడ్చారు. ఆ మోటారును పైకి తేవల్సి ఉండగా, లచ్చయ్య, మోటర్ మెకానిక్, మరో స్నేహితుడు ఆదివారం బావి వద్దకు వెళ్లారు. 22 అడుగుల లోతు ఉన్న గుంతలోకి లచ్చయ్య దిగి మోటార్‌కు తాడు కట్టేందుకు ప్రయత్నంచేస్తూనే దుర్వాసన ఉందంటూ పెద్దగా కేక వేసి కుప్పకూలిపోయాడు. పైన ఉన్న స్నేహితుడు ఆ గుంతలోకి దిగే ప్రయత్నంచేసి ఎనిమిది అడుగుల లోపలికి వెళ్లి దుర్వాసన వస్తుందని వెనక్కి తిరిగాడు. లచ్చయ్య లోపలే ఊపిరాడక మృతిచెందటంతో పోలీసులు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారమి చ్చారు. మునగాల తహసీల్దార్ అంజనేయులు, ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి, కోదాడ అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని బావికి సమాంతరంగా తవ్వి సాయంత్రం ఆరు గంటల సమయంలో మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య శేషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దార్యప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.




లక్ష్మయ్య మృతదేహాన్ని బయటికి తీస్తున్న అధికారులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సూర్యాపేటటౌన్, జూలై 21: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 44వార్డులో పర్యటించి మాట్లాడారు. వారంలో మూడు, నాలుగు రోజులు వార్డుల్లో పర్యటిస్తానని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వానాకాలం నేపథ్యంలో దోమలు వృద్ధి చెందకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, చింతమల్ల రమేష్, భైరు శైలేందర్ గౌడ్, కుంభం రాజేందర్ నాయకులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు తూము గేటు ఏర్పాటు

తిరుమలగిరి, జులై 21: తిరుమలగిరి మునిసిపాలిటి కేంద్రంలోని పెద్ద చెరువు తూము గేటు కొన్ని నెలల క్రితం మరమ్మత్తులకు గురైంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సామేలు దృష్టికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పై.నరేష్ తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే సామేలు సహకారంతో చెరువు తూముకు నూతన గేటును ఆదివారం అమర్చారు. కార్యక్రమంలో స్థానికులు, రైతులు గాదరబోయిన ఉప్పలయ్య, మాసంపల్లి మోహన్, సోమనర్సయ్య, గాదనబోయిన లింగయ్య, బేతు అవిలయ్య, రాకేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట టౌన్: ప్రతి ఒక్క భవన నిర్మాణ కార్మికుడు ప్రభుత్వం అందజేసే లేబర్ కార్డును తీసుకోవాలని తాపీ పనివారుల సంఘం డివిజన్ అధ్యక్షుడు వల్దాస్ శీను అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సభ్యులు గుత్తి నగేష్, కోట శ్రవణ్, అంజయ్య, కుంచం రవి, పోలగాని బిక్షంగౌడ్, వంగూరి డానియల్, నామ సైదులు, గోనె నాగయ్య, మల్లెల నర్సిరెడ్డి పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్: ఈ నెల 25వ తేదీన జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) రద్దుకు నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేయాలని ఆయన కోరారు.

సూర్యాపేట అర్బన్: దేశంలో, రాష్ట్రంలో కొలువుదీరిన ప్రభుత్వాలు ఎన్నికల హామీలను పారదర్శకంగా అమలుచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ కోరారు. జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో ఆగస్టు మూడో తేదీన నిర్వహించే జిల్లా నిర్మాణ విస్తృత కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు సమావేశంలో ఉస్తెల సృజన, మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్, నిమ్మల ప్రభాకర్, దీకొండ శ్రీను, రాజారాం పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి బహిరంగ సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూళిపాల ధనుంజయనాయుడు కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో ఓబీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. కేంద్రంలో బీసీలకు మంత్రి పదవి ఇవ్వడంతో పాటు రూ.20లక్షల కోట్లతో సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సైదులు, వెంకన్న, ప్రకాష్, నర్సయ్య, పుల్లయ్యపాల్గొన్నారు.

చిలుకూరు, నేరేడుచర్ల రైతు బీమా కోసం ఆగస్టు 5వ తేదీ లోగా అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని చిలుకూరు, నేరేడుచర్ల ఏవోలు శ్రీధర్, జావిద్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 18-59 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం గానూ రైతుబీమా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌లను వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందించాలని కోరారు.

నేరేడుచర్ల: పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఫొటో, వీడియోగ్రాఫర్ల మండల సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పంగ బుచ్చిబాబు, ప్రధాన కార్యదర్శిగా మచ్చ సునీల్, గౌరవ అధ్యక్షుడిగా చందమళ్ల శ్రీరాములును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బుచ్చిబాబును ఫొటోగ్రాఫర్ల సంఘం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బాలస్వామి, సైదులు, మచ్చ రవి, ఇంజమూరి వెంకటేశ్వర్లు, నర్సింహాచారి, గణేష్, శంకర్ పాల్గొన్నారు.

నూతన్‌కల్: బ్రెయిన్ స్ట్రోక్‌తో అస్వస్థతకు గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కవి, గాయకుడు జయరాజ్‌ను ఎమ్మెల్యే మందుల సామేలు పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం సహాయ, సహకారాలు అందిస్తుందని భరోసా ఇచ్చారు.

మఠంపల్లి: మండలంలోని కృష్ణతండా, సుల్తాన్‌పురం తండాలలో ఆదివారం వన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రజలు కుటుంబ సమేతంగా గ్రామ పొలిమేరల్లోని గ్రామ దేవతల ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు నైవేద్యం సమర్పించి పాడి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని మొక్కుకున్నారు.

కోదాడ రూరల్: రాజీవ్‌గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో భాగంగా గణపవరం చెరువు రూ.30 కోట్లతో లిఫ్ట్‌ను నిర్మించడానికి ప్రభుత్వం ముందుకు రావడంతో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సింగారెడ్డి హిమబిందు సుమన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చిలుకూరు: లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని దూద్యాతండా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బాణోతు నందాలాల్‌ను నియమించారు. హైదరాబాద్‌లో జరిగిన ఎల్‌హెచ్‌పీఎస్ కేంద్ర కమిటీ సమావేశంలో నందాలాల్‌కు నియామకపత్రాన్ని ఎల్‌హెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్యనాయక్ అందజేశారు.

అర్వపల్లి: మండల కేంద్రానికి చెందిన మోత్కూరి శివప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. జాజిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల1988-89బ్యాచ్ పదో తరగతి తోటి విద్యార్థులు, మిత్రులు కలిసి రూ.27,100ఆర్థికసాయాన్ని శివప్రసాద్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో యోగాచారి, పగిళ్ళసైదులు, దారం నాగరాజు, దాసరి సోమయ్య, డి. వెంకన్న, శ్రీనివాస్, దడిపల్లి వెంకట్, మీలా శ్రీనివాస్, ఏలె వెంకటేశ్వర్లు, మోత్కూరి హరిబాబు, రామసాని వీరయ్య, కె. రవిందర్, అర్చకులు మోత్కూరి రాజుశర్మ, వెంకటశర్మ పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండలంలోని లింగంపల్లి గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మడ్డి లింగయ్య తండ్రి సీనియర్ నాయకుడు మడ్డి లక్ష్మీనర్సు మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. లక్ష్మీనర్సు మృత దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. గోరుగంటి మోహన్‌రావు, పాపయ్య, రాంకిషన్‌రావు పాల్గొన్నారు.